క్లుప్తంగా

23న నందిగామలో జాబ్‌మేళా

నందిగామ టౌన్: యువతకు ఉద్యోగావకావకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని కేవీఆర్ కళాశాల ఆవరణలో ఈ నెల 23న మెగా జాబ్ మేళా జరుగుతుందన్నారు. 20కి పైగా ప్రముఖ కంపెనీలతో రెండు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్‌కు సత్కారం



పెనుగంచిప్రోలు: ఉత్తమ సేవలందించిన స్థానిక కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పారుపల్లి దుర్గాప్రసాద్‌ను సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ ప్రశంసాప్రతంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం బ్యాంక్ ఆవరణలో బ్యాంక్ మేనేజర్ రంగిశెట్టి రజనీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సూపర్‌వైజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి

కంచికచర్ల: వినాయక చతుర్థి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో వినాయకుడి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులను ఎన్నుకోవాలని ఎస్‌ఐ పి.విశ్వనాథ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మండపం లేదా పందిరిలో అన్ని రకాల అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇసుక, వాటర్ డ్రమ్ములు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. ముందుగా విగ్రహాలను ఏఏ ప్రదేశాలలో ఏర్పాటు చేస్తున్నారో ఆ ప్రదేశాల వివరాలతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగా పోలీస్‌స్టేషన్ అనుమతులు తీసుకోవాలన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో విగ్రహాలను ఏర్పాటు చేసేవారు సంబంధిత గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోవాలన్నారు. ముందుగా వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేయటం ముందు ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జగ్గయ్యపేట అర్బన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలంతా శక్తివంచన లేకుండా కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. ఇటీవల పట్టణంలో జరిగిన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ మహాసభలు విజయవంతం అయిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో సెంటర్‌లోని టీచర్స్ కోపరేటివ్ సొసైటీ భవనం ఆవరణలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన విజయోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దోనేపూడి శంకర్ కార్యకర్తలకు, నూతనంగా ఎన్నికైన బాధ్యులకు పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా మహాసభల విజయవంతానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సహకారాలు అందజేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంకా ముంపులోనే వరి చేలు

- పొలాలను ముంచెత్తిన దూళ్లవాగు, కూచివాగు
- వరద ఉధృతికి పొలాల్లో పేరుకుపోయిన రాళ్లు, ఇసుక
- వాగుల పక్క పొలాలకు ప్రతి ఏడాదీ తప్పని మునక
- వరద తగ్గకపోతే మళ్లీ నాట్లు వేయాల్సిందే



అనిగండ్లపాడు వద్ద వరద నీటిలో నాట్లు వేసిన వరి పొలాలు

పెనుగంచిప్రోలు: అల్పపీడన ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో పంట చేలు ముంపు బారిన పడ్డాయి. మండలంలోని అనిగండ్లపాడు వద్ద దూళ్లవాగు నేటికీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అనిగండ్లపాడుతో పాటు గుమ్మడిదుర్రు వద్ద కూడా వరి పొలాల్లో నీరు ప్రవహిస్తోంది. అలాగే శనగపాడు వద్ద కూడా వరి పొలాల్లో వరద నీరు ఇంకా అలానే ఉంది. రెండు రోజులుగా ఆగకుండా కురుస్తున్న వర్షం అన్నదాతలను మరింత కలవర పెడుతోంది. గుమ్మడిదుర్రు వద్ద వాగు పొంగి పొలాల్లో రాళ్లు, ఇసుక పేరుకుపోయాయి.

810 ఎకరాల్లో వరి పంట ముంపు

ఇప్పటికే వరదలకు వాగులు పొంగి నియోజకవర్గంలో 810 ఎకరాల్లో వరి ముంపునకు గురైనట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వాగులు పక్కన ఉన్న వరి పొలాల్లో ప్రతి ఏడాది వర్షాలకు పొలాలు నీట మునగటంతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. వర్షాలు మరికొన్ని రోజులు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్న నేపథ్యంలో ముంపు నుంచి కోలుకునే పరిస్థితి లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేల రూపాయిలు పెట్టుబడి పెట్టామని, నారు వరద నీటిలో నానిపోతుండటంతో మరలా నాట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. ప్రతి ఏడాది తమకు నష్టం తప్పటం లేదని, వాగుల వద్ద పూడిక తీయాలని అంటున్నారు. పిలకలు కట్టే దశలో వరి పొలం త్వరగా పుంజుకోవాలంటే నీటిని తీసివేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10–15 కిలోల పొటాష్ వేసుకోవాలని వ్యవసాయాధికారులు అంటున్నారు.



గుమ్మడిదుర్రు వద్ద వరదకు పొలాల్లో చేరిన రాళ్లు, ఇసుక



శనగపాడు వద్ద నీటిలో వరి పొలం

పొలాలపై వాగు నీరు ప్రవహిస్తోంది



అనిగండ్లపాడు వద్ద దూళ్లవాగు నేటికీ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నాట్లు వేసిన వరి పొలాలపై వరద నీరు ఉండటంతో పంట కుళ్లి పోతోంది. ఇప్పటికే వేల రూపాయలు పెట్టుబడి పెట్టాం. వరద తగ్గకపోతే మళ్లీ నాట్లు వేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని.

–కందిమళ్ల సాంబశివరావు, రైతు, అనిగండ్లపాడు

వాగుల వద్ద పూడిక తీయాలి



ఇప్పటికే కూచివాగు, దూళ్లవాగు పొంగి పొలాలు ముంపునకు గురయ్యాయి. వరద కొంత తగ్గినా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు మళ్లీ పొంగుతున్నాయి. ప్రతి ఏడాది వర్షాలకు పొలాలు నీట మునుగుతున్నాయి. వాగుల వద్ద పూడిక తీయాలి.

–మురళి, రైతు, అనిగండ్లపాడు

కోతకు గురవుతున్న రహదారి

- ఆర్‌అండ్‌బీ అధికారుల అశ్రద్ధే కారణం
- తారు రోడ్డు బదులు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయాలి



కల్వర్టు వద్ద కోతకు గురవుతున్న రోడ్డు

పెనుగంచిప్రోలు: ఆర్‌అండ్‌బీ అధికారుల అశ్రద్ధ వల్ల చెరువు కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురవుతోందని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్థానిక చెరువు అలుగుల వద్ద సుమారుగా రూ.కోటి నిధులతో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కల్వర్టు నిర్మించారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు నిర్మించే క్రమంలో ఇరువైపులా తారురోడ్డు నిర్మించటంతో వరదకు మరలా కోతకు గురవుతోందన్నారు. కల్వర్టుకు ఇరువైపులా 20 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణం చేస్తే కోతకు గురి కాదన్నారు. చెరువు కట్ట వద్ద నుంచి సుబ్బాయిగూడెం వెళ్లే రోడ్డు కూడా తారు రోడ్డు వేయటం వల్ల ఎప్పుడు వరద వచ్చినా కోతకు గురవుతోందన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే తాతయ్య



పేటలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, కాకానినగర్ పరిసర ప్రాంతాలు ఇటీవల వరద ముంపునకు గురైన నేపథ్యంలో ఎమ్మెల్యే తాతయ్య అధికారులతో కలిసి మంగళవారం ఆ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద ముంపు కారణంగా దెబ్బతిన్న తాగునీటి పైపులైన్లను యుద్ధప్రాతిపదికన రెండు రోజుల్లో పునర్నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద ముప్పు ఉంటే ప్రజలు వెంటనే ఇతర సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, సహాయం చేస్తుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, నాయకులు రామకృష్ణారెడ్డి, కట్టా నరసింహారావు, మైనేని రాధాకృష్ణ, యామర్తి బోసుయాదవ్, గింజుపల్లి కృష్ణ, గడ్డం రాంబాబు, కొత్తా నాగరాజు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలకనుగుణంగా ఎరువులు వాడాలి



కమ్మవారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

నందిగామరూరల్: రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి గింజుపల్లి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కౌలు రైతులు విధిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని, గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకే అన్నదాత సుఖీభవతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ముఖ్యంగా ఖరీఫ్–2025లో సాగు చేసిన అన్ని పంటలను డిజిటల్ ఈ–క్రాప్ సర్వే ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మానస, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరి పంట పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగ్గయ్యపేట: పంట పొలాలలో నిలిచిన వర్షపు నీటిని బయటకు తీయాలని కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు తెలిపారు. అధిక ముంపునకు గురైన తక్కెళ్లపాడు, బలుసుపాడు, షేర్ మహ్మద్‌పేట తదితర గ్రామాలలోని పంట పొలాలను శాస్త్రవేత్తలతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 కేజీల యూరియా, 15 నుంచి 20 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయటంతో పాటు లీటరు నీటికి రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయటం వల్ల నీట మునిగిన పంట పొలాలు త్వరగా కోలుకుంటాయన్నారు. వీటితో పాటు పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శివప్రసాద్, రాజశేఖర్, డాక్టర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పటం ఆవిష్కరణ



మక్కపేట(వత్సవాయి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సామాజిక విజ్ఞాన కళాశాల, గుంటూరు లాంఫాం విద్యార్థులు మంగళవారం గ్రామ సచివాలయంలో గ్రామ పటాన్ని ఆవిష్కరించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్ర వారి ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు మూడు నెలలపాటు గ్రామంలో ఉండి రైతులతో మమేకమై వ్యవసాయంలోని మెలకువలను నేర్చుకుంటూ వారు చదువుకున్న కొన్ని విషయాలను రైతులతో పంచుకుంటూ మూడు నెలలు ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ పటాన్ని వేసి గ్రామంలోని ముఖ్యమైన ప్రదేశాలు వ్యవసాయ, బీడు భూముల వివరాలను కూడా సమూలంగా రైతులకు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఆర్.ప్రభావతి, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త కె.అచ్యుతరాజు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పీఎస్ శివప్రసాద్, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



నందిగామలోని అసోసియేషన్ కార్యాలయంలో ఫొటోగ్రఫీ దినోత్సవంలో ఫొటోగ్రాఫర్లు

నందిగామరూరల్: ఫొటోగ్రఫీ మానవ జీవితంలో మరపురాని క్షణాలను, ముఖ్యమైన ఘట్టాలను శాశ్వతంగా పదిలపరుస్తుందని నవ నందిగామ ఏరియా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డాగ్యురోటైప్ అనే ఫొటోగ్రఫీ ప్రక్రియను కనుగొన్న లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ రంగంలో తమదైన ముద్ర వేసుకున్న ఫొటోగ్రాఫర్‌లను గౌరవించి కొత్త ప్రతిభను ప్రోత్సహించేందుకు ఫొటోగ్రఫీ దినోత్సవం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కృష్ణ, లక్ష్మణ్, చక్రి, మురళి, వెంకట్, రాంప్రసాద్, బడేమియా, నాగరాజు, రామారావు, హమీద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర సర్వీసు పేరుతో అందని స్త్రీశక్తి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం పేరుతో ఇటీవల అమలు చేసిన ఉచిత బస్సు పథకం రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచులకు అందడం లేదని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ తరహాలో ఆంధ్ర పరిధిలో ఉన్న గ్రామాలకు స్త్రీశక్తి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం 10, 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న సరిహద్దు గ్రామీణ ప్రాంతాలకు స్త్రీశక్తి పథకం అమలుచేయకపోవడం దారుణం అన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు స్త్రీశక్తి పథకం అమలయ్యేటట్లు చూడాలన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు ఎక్కువగా బస్సులను ఉపయోగించుకుంటారు కాబట్టి ప్రభుత్వ బస్ సర్వీసులను పెంచాలని కోరారు. స్త్రీశక్తి పథకం అమలుచేసే లోగా బస్సులు కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు బస్ సర్వీసులను పెంచలేదని, బస్సులను కూడా కొనుగోలు చేయలేదన్నారు. నూతన బస్సులు కొనుగోలు చేయడంతో పాటు ఆర్టీసీలో ఉద్యోగాలను కూడా భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం పునరాలోచన చేసి అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ఆడపడుచులకు స్త్రీశక్తి పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

14 నెలల్లో లక్షల కోట్ల అప్పు

- ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్న చంద్రబాబు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, పక్కన సీపీఎం నాయకులు

వీరులపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రాజధానిని సెల్ఫ్ ఫైనాన్స్‌గా చూపుతూ రూ.లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. వీరులపాడు మండలంలోని జుజ్జూరు గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అమరావతి పేరుతో ప్రజలకు మాయమాటలు చెబుతూ రూ.లక్షల కోట్లు అప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు ఇవ్వకుండా భూ దోపిడీ చేసేందుకు మరో 44 వేల ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ చేస్తామనటం రైతులను మరోసారి వంచించటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ల్యాండ్ పూలింగ్‌కు సీపీఎం వ్యతిరేకం..

ల్యాండ్ పూలింగ్‌కు సీపీఎం వ్యతిరేకమని, బలవంతంగా పూలింగ్‌కు పాల్పడితే రైతుల పక్షాన పోరాడతామని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి చేయకపోవటం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో రాష్ట్రానికి పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చెప్పటం తప్ప 14 నెలల కాలంలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కనీసం రైతులు పండించిన పంటలకు సైతం గిట్టుబాటు ధర కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, బాబురావు, చాట్ల రవి, మంగళపూడి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న గోమాతలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని పోలీసులు



కంచికచర్లలో నడిరోడ్డుపై ఆవుల స్వేచ్ఛావిహారం

కంచికచర్ల: కంచికచర్లలో నడిరోడ్డుపై ఆవులు, దూడలు చేరి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. దీంతో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ప్రయివేటు బస్సులు, ఆటో డ్రైవర్లు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆవులను సమీపంలోని గోశాలకు తరలించాలని పట్టణ ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

ఆవులను గోశాలకు తరలించాలి

నిత్యం బస్సులు, కార్లు, పలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆర్ అండ్‌బీ రహదారిపై పశువులు ఉండటం వల్ల ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాక్షాత్తు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆర్ అండ్‌బీ రహదారిపై అడ్డంగా పడుకుంటున్న ఆవులను గోశాలకు తరలించాలని పట్టణ ప్రజలు వాహనదారులు అనేకసార్లు పోలీసులు, రెవెన్యూ అధికారులకు చెప్పినా ఫలితం లేకపోయిందని అంటున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ రోడ్డుపై ఉంటున్న ఆవులు, దూడలను గోశాలకు తరలించాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

పులిచింతల నుంచి నాలుగు లక్షల క్యూసెక్కులు విడుదల



పులిచింతల నుంచి దిగువకు వస్తున్న కృష్ణమ్మ

జగ్గయ్యపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేయటంతో మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరింది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి 13 గేట్ల ద్వారా ప్రకాశం బ్యారేజ్‌కు నీటిని విడుదల చేశారు. దీంతో మంగళవారం నదీ పరివాహక ప్రాంతాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాలలో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు బోట్లను ఒడ్డుకు తీసుకువచ్చి జాగ్రత్త చేసుకున్నారు. రావిరాల గ్రామంలో కృష్ణానది, పాలేటి సంగమం వద్ద కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు కోతకు గురయ్యే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా అధికారులెవరూ గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని సంగమ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా మరో రెండు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయటంపై కూడా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముక్త్యాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది



రావిరాల వద్ద కృష్ణా, పాలేటి సంగమం వద్ద కృష్ణమ్మ ఉధృతి



రావిరాలలో ఒడ్డుకు చేరిన పడవలు

మంచినీటి సరఫరాకు అంతరాయం



కాకానినగర్‌లో పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని కాకానినగర్‌లో గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో గత రెండు రోజులుగా నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానికులు సమస్యను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా ఆయన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో మాట్లాడి సమస్య తీవ్రతను తెలియజేశారు. స్పందించిన చైర్మన్ మంగళవారం యుద్ధప్రాతిపదికన పైపులైన్ వాల్‌పిట్‌ను, ఇతర సమస్యలను గుర్తించి మరమ్మతు పనులు చేపట్టారు. సాయంత్రానికి తాగునీరు రావడంతో వార్డు ప్రజలు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రకు కృతజ్ఞతలు తెలియజేశారు.